అనుమతిలేకుండా శ్మశానవాటిక నిర్మించొద్దు

కొత్తూరు, జూలై 26: గ్రామస్తుల అనుమతి లేకుండా ఒక మతానికి చెందిన శ్మశానవాటిక ఎలా నిర్మిస్తారని మండల పరిధిలోని కొడిచెర్ల వాసులు శుక్రవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. కొడిచెర్ల తండా పంచాయతీ పరిధిలో రెండెకరాల ప్రభుత్వం స్థలం ఉంది. ఆ స్థలంలో క్రిష్టియన్ కమ్యూనిటీ చెందిన శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పై అధికారులకు విషయం తెలియచేస్తానని చెప్పారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, బిచ్చునాయక్, మోహన్‌నాయక్, విష్ణునాయక్, దేవినాయక్, వెంకట్‌నాయక్, దమ్లానాయక్, కిషన్‌నాయక్, సంతోశ్‌నాయక్, రవినాయక్, శంకర్‌నాయక్, సామ్యనాయక్, చందర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, మోహన్‌నాయక్, తుల్జానాయక్ పాల్గొన్నారు.

అందుబాటులో పశుగ్రాసం విత్తనాలు

కడ్తాల్, జూలై 26 : పశుగ్రాసం కోసం ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మండల పశువైద్యాధికారి భానూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పాడి రైతుల కోసం సీహెచ్ ఎస్ 24ఎంఎఫ్ జోవర్ రకం పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన పాడి రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో పశు వైద్యశాలలో సంప్రదించాలని కోరారు.

విద్యా రంగానికి తీవ్ర అన్యాయం

ఇబ్రహీంపట్నంరూరల్, జులై 26 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వంశీ, తరంగ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూస్తున్నదన్నారు. దీన్ని నిరసిస్తూ ఇబ్రహీంపట్నంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తుందని దుయ్యబట్టారు. విద్యా రంగానికి తక్కువ బడ్జెట్ కేటాయించటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, రాకేశ్, ముబీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయిబర్స్‌మెంట్
వెంటనే విడుదల చేయాలి

రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆమనగల్లు, జూలై 26 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ , ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరటి భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఆమనగల్లు –శ్రీశైలం జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు లండం మల్లేశ్, విద్యార్థి సంఘం నాయకులు అంజి, మల్లేశ్, విజయ్, సిద్ధు, ప్రసాద్, ఠాగూర్, చరణ్, రాకేశ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మొయినాబాద్, జూలై 26 : మండల పరిధిలోని బాకారం జాగీర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను నేతలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన నర్సింగ్‌రావును సీనియర్ నాయకులు నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ సువర్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతారంలో..

చేవెళ్ల రూరల్ : మండల పరిధిలోని అంతారం, శంకర్‌పల్లి మండల పరిధి పర్వేద జడ్పీహెచ్ఎస్‌లో సేవలందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్తులు శుక్రవారం పాఠశాలల్లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు పరిగి మల్లేశ్ కుమార్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, రాజు, యాదయ్య, మంజుల, శ్వేత, కవిత, విద్యార్థులు, గ్రామస్తులు, స్కూల్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

అంతారంలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

గురుకులాల్లో నాణ్యమైన విద్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, జూలై26 : గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలోని 84 ఖాళీ సీట్ల భర్తీ కోసం శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలోని చేవెళ్ల బాలికల గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 10వ తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా సీట్లను భర్తీ చేసినట్లు గురుకుల విద్యా సంస్థల అధికారి డాక్టర్ శారదా వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ అధికారి నాగకళ్యాణి, చేవెళ్ల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, అనంతగిరిపల్లి కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

చేవెళ్లటౌన్ : పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాపేట్ మండలాలకు చెందిన 96 మందికి లబ్ధిదారులకు ఎమ్మెల్యే యాదయ్య చేతుల మీదిగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద లబ్ధిదారులకు రూ.37లక్షల 64వేల 500ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ దవాఖానల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజల వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ జడ్పిటీసీ మాలతి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారి శైలజఆగిరెడ్డి, గోపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు పాండుయాదవ్, మాణిక్యం, నరేందర్‌గౌడ్, లబ్ధిదారులు ఉన్నారు.

11వ వార్డులో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

వానకాలం జాగ్రత్తలు పాటించాలి

- శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

చేవెళ్ల రూరల్, జూలై 26 : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై ఆమె 11వ వార్డులో శుక్రవారం పర్యటించి సిబ్బంది, ప్రజలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గుంతల్లో నీటిని నిల్వ ఉంచరాదని, పరిసరాల్లో ప్లాస్టిక్‌ను ఉంచరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరించింది

షాద్‌నగర్‌టౌన్, జూలై 26: కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ఎలాంటి నిధులను కేటాయించకపోవడం సరికాదని వికలాంగుల జాతీయ వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు భుజంగారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో శుక్రవారం బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 2024–25ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన 2,91లక్షల కోట్ల బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమం కోసం ఎలాంటి నిధులను కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తామని తీరా అధికారం వచ్చాక దివ్యాంగులను విస్మరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 29816కోట్లను కేటాయించారని, ఈ కేటాయింపులతో ఆసరా పెన్షన్ల పెంపు ఎలా సాధ్యమవుతుందన్నారు. దివ్యాంగులకు రూ. 6వేలు, ఇతర పెన్షన్లు రూ. 4వేలు పెంచేందుకు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, శేఖర్, సంతోష, కుసుమ, మనీలా, మల్లేష్, నర్సింహులు, బాల్‌రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొత్తూరులో పాత జాతీయ రహదారిపై రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు/షాద్‌నగర్, జూలై 26: రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. కొత్తూరు మున్సిపాలిటీలోని వై జంక్షన్ నుంచి పూలే విగ్రహం వరకు నూతనంగా నిర్మిస్తున్న పాత జాతీయ రహదారి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ఎన్నేండ్లయినా చెక్కు చెదరకుండా ఉండేలా నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్, ఇందూరి శ్రీనివాస్, జాండగూడెం శ్రీశైలంగౌడ్, నవీన్‌చారి, గోవింద్‌నాయక్, చింతసాయి, తేజేశ్వర్, హుస్సేన్, నరసింహ ముదిరాజ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ వసంత

నీటి తొట్టెలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆమనగల్లు, జూలై 26 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగానే ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని సాకిబండతండాలో శుక్రవారం సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం మున్సిపాలిటీలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో పందుల సంచారం ఎక్కువగా ఉన్నదని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు పెంపకం దారులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

తెలంగాణలో మరో సెల్‌బే మొబైల్ స్టోర్ ప్రారంభం

తెలంగాణకు చెందిన అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మల్టీబ్రాండ్ రిటైల్ చైన్ సెల్‌బే యాజమాన్యం శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో నూతన షోరూంను ప్రారంభించింది

విరివిగా మొక్కలు నాటాలి

కొండకల్ జడ్పీహెచ్ఎస్‌లో వన మహోత్సవం

చేవెళ్ల రూరల్ : కొండకల్ జడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

చేవెళ్ల రూరల్, జూలై 26 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. శుక్రవారం కొండకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయితీ పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య, ఉపాధ్యాయులు రఘునందన్‌రెడ్డి, కృష్ణయ్య, అంజిరెడ్డి, కుసుమకుమారి, శ్రీనివాస్, జగదాంబ, జంగయ్య, హరికృష్ణ, మల్లేశ్, కవ్వ గూడెం శ్రీను, ఇందిరాబాయి, రాధ, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచాల: చీదేడులో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో బాలశంకర్

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మంచాల : మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. శుక్రవారం మంచాల మండలం చీదేడు గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా ఆయన అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, గ్రామ ప్రత్యేకాధికారి శారధ గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు

షాద్‌నగర్‌టౌన్, జూలై 26: షాద్‌నగర్ మున్సిపాలిటీలో శుక్రవారం మైసమ్మ బోనాలను పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మున్సిపాలిటీలోని ఎల్ఎన్‌కాలనీ, రైతుకాలనీ మైసమ్మ దేవాలయం వద్ద అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువతులు బోనాలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం తొట్టెలను ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

చోరీకి యత్నించిన దొంగల అరెస్ట్

కొత్తూరు, జూలై 26 : కిరాణ దుకాణంలో వస్తువులు కొనే సాకుతో మంగళసూత్రం చోరీకి యత్నించిన ఇద్దరు దొంగలను కొత్తూరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే గురువారం మండల పరిధిలోని ఖాజిగూడతండాలో కొడావత్ మంజుల కిరాణ దుకాణానికి ఇద్దరు వ్యక్తులు వస్తువులు కొనడానికని వచ్చారు. ఉన్నంటుండి వారు మంజుల మెడలోని మంగళసూత్రం లాక్కెళ్లే ప్రయత్నం చేయగా.. ఆమె ప్రతిఘటించడంతో బైక్‌పై పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, శుక్రవారం సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో నాట్కో జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించిన వారిని అదుపులోకి తీసుకొని విచారించగా కేశంపేట మండలానికి చెందిన జరుపుల వెంకటేశ్, ఆంగోత్ పవన్ తెలిసింది. విచారణలో నేరం చేసినట్లుగా ఒప్పుకోగా.. వారి నుంచి బైక్, సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కడ్తాల్ ఎంపీవోగా విజయ్‌కుమార్ పాల్

కడ్తాల్, జూలై 26 : కడ్తాల్ ఎంపీవోగా విజయ్‌కుమార్ పాల్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తేజ్‌సింగ్ బదిలీపై నందిగామ మండలానికి వెళ్లగా, ఆయన స్థానంలో జిల్లెల చౌదరిగూడ ఎంపీవో ఇక్కడకు వచ్చారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా, వారి స్థానంలో కొత్త వారు వచ్చారు. అల్లాజీ (కడ్తాల్), చోటే (వాసుదేవ్‌పూర్), శ్రీలక్ష్మి (మర్రిపల్లి), జగదీశ్ (ముద్విన్), వెంకట్‌రెడ్డి (మక్తమాదారం), కుమార్ (కొండ్రిగానిబోడుతండా), లక్ష్మణ్ (పెద్దవేములోనిబావితండా), పరమేశ్వర్ (గాన్సుమార్లతండా), రాఘవేందర్ (గడ్డమీదితండా), శివప్రసాద్ (గోవిందాయిపల్లితండా), జంగయ్య (కర్కుల్‌పహాడ్), సందీప్ (చల్లంపల్లి), జంగయ్య (మైసిగండి) నియామకమయ్యారు. అలాగే గతంలో ఇన్‌చార్జీగా పీఆర్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వర్ రెగ్యులర్ ఏఈగా బాధ్యతలు స్వీకరించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తుల రిమాండ్

మంచాల, జూలై 26 : దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచాల సీఐ బాబ్యానాయక్ శుక్రవారం తెలిపారు. ఆగపల్లి సమీపంలో ఉన్న క్రషర్ మిషన్‌లో సుమారు టన్ను బరువు ఉన్న ఇనుప సామగ్రిని దొంగిలించారని క్రషర్ మిషన్ సూపర్‌వైజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హయత్‌నగర్ మండలం బంజారాకాలనీకి చెందిన అల్లకుంట్ల గోపి, పిట్టల రాజు, దండుగుల శ్రీను, ఇరగండ్ల వీరబాబులు దొంగతనానికి పాల్పడినట్లు తేలడంతో వారిని అరెస్ట్ చేయడానికి వెళ్లారు. పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు తప్పించుకోగా గోపి, రాజులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ. 50వేలు విలువచేసే క్రషర్ మిషన్ సామానును స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. పరారీలో ఉన్న మరో ఇద్దరికి కోసం గాలిస్తున్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోండి

మంచాల రైతు వేదికలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మంచాల, జూలై 26 : కొత్త పట్టా పాస్‌బుక్ పొందినవారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మంచాల మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిశ్రీ తెలిపారు. శుక్రవారం మంచాల రైతు వేదికలో రైతు బీమాకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దరఖాస్తు ఫారానికి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డుల జిరాక్స్‌లను జత చేసి ఏఈవోలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు లింగస్వామి, సరిత పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజన విభాగం
జిల్లా అధ్యక్షుడిగా శ్రీనూనాయక్

షాద్‌నగర్‌రూరల్, జూలై 26: ఆదివాసి గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనూనాయక్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనూనాయక్‌ను శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు జిల్లాలోని గిరిజన ప్రజలకు సేవ చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

చేవెళ్ల రూరల్, జూలై 26 : చేవెళ్ల మండల పరిధి రామన్నగూడ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, దివంగత పెద్దొళ్ల పర్మయ్య 6వ వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం దివంగత పెద్దొళ్ల పర్మయ్య కుమారుడు పెద్దొళ్ల దయాకర్ తండ్రి జ్ఞాపకార్థం రామన్నగూడ గ్రామంలోని మొత్తం పింఛన్‌దారులు దాదాపు 100 మందికి దుస్తులు పంపిణీ చేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ పెద్దొళ్ల ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్, గ్రామ యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి

కడ్తాల్, జూలై 26 : మండల కేంద్రంలో శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను అర్పించిన యుద్ధ వీరులకు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్‌జీ, నాయకులు సురేశ్, శ్రీశైలంగౌడ్, కుమార్, అజిత్, రాకేశ్, సిద్దార్థ్, నందీశ్వర్, దశరథం, అరుణ్, భరత్ వేణు, చరణ్, వంశీ, సిద్ధు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన యువకుడిపై కేసు

మొయినాబాద్, జూలై26: సీనియర్ జర్నలిస్టుపై దాడికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు అయ్యింది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ముర్తుజాగూడ గ్రామానికి చెందిన గణేష్ సూర్య దినపత్రికలో జిల్లా రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మోసిన్ శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో గణేష్ ఇంటికి వెళ్లి గణేష్‌ను తిడుతూ హంగామా చేశాడు. పథకం ప్రకారంలో కారులో వచ్చిన కొందరు వ్యక్తులు రాగా, గణేష్ బయటకు వచ్చిన తరుణంలో మోసిన్ కారులో నుంచి ఒక మారుణాయుధాన్ని తీసుకుని గణేష్‌పై దాడి చేయడానికి ప్రయత్నించాడు. దీన్ని పసిగట్టిన గణేష్ తనను హత్య చేసే కుట్ర చేస్తున్నారని భావించి అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో స్థానికులు నిద్రలేచి బయటకు రావడంతో దాడి చేయడానికి ప్రయత్నించిన యువకుడు, అతనితో పాటు వచ్చిన వారు కార్లలో పారిపోయారు. గణేష్ 100 డయల్ చేసి దాడి జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పాడు. తనపై దాడికి యత్నించిన వారిని గుర్తించాలని గణేష్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.